క్లుప్తంగా

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



చిక్కడపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. అశోక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, శారద మహిళా మండలి నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. అసోసియేషన్ వారి విజ్ఞప్తి మేరకు టైలరింగ్ శిక్షణ కోసం కావాల్సిన పలు సామగ్రిని స్వచ్ఛందంగా అందజేశారు. బీజేపీ నాయకులు వినయ్, నవీన్, అసోసియేషన్ అధ్యక్షులు రామమూర్తి, కార్యదర్శి సూర్యనారాయణ, రమేష్, మహిళామండలి సభ్యులు నాగలక్ష్మి, పద్మావతి, కాళిందిదేవి తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత సాహితీవేత్త మధునాపంతుల శాస్త్రి



చిక్కడపల్లి: మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి మహోన్నత సాహితీవేత్త అని తెలంగాణ మాజీ సమాచార చీఫ్ కమిషనర్ బుద్ధామురళి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎందరో మహానుభావుల మధుర స్మృతులతో శీర్షిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ప్రముఖ సాహితీవేత్త మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి జయంతి సభ గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. బుద్ధామురళి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సత్యనారాయణశాస్త్రి రచనలు సమాజాన్ని ఎంతో ప్రభావితం చేశాయని వారు ఎందరో సాహితీవేత్తలకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. పాత్రికేయులు జయసూర్య, వైశ్యఫెడరేషన్ నాయకులు పీఎస్ఆర్ మూర్తి, సంఘసేవకులు రవికుమార్ తదితరులున్నారు.

తాగునీటి వృథా !



పైప్‌లైన్ పగిలిపోవడంతో వృథాగా పోతున్న తాగునీరు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్ వీఎస్‌టీ ప్రాంతంలోని సరోజిని అకాడమీ సమీపంలో గత రెండ్రోజులుగా తాగునీటి సరఫరా పైప్‌లైన్ పగిలి తాగునీరు ఏరులై పారుతోంది. ఇంకుడు గుంతల ద్వారా నీటిని సంరక్షించుకోవాలని ప్రభుత్వం ఓ వైపు చెబుతున్నా.. అధికారులు నిర్లక్ష్యం కారణంగా నగరవాసులకు జలమండలి సరఫరా చేసే నీరు వృథాగా పారుతుండటంతో వీఎస్‌టీ సమీపంలోని పరిసర ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. దీనిపై జలమండలి అధికారులు స్పందించకపోవడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

యువతి అదృశ్యం



పద్మావతి (ఫైల్)

నల్లకుంట: డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ యువతి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై కాశయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్. క్రిష్ణ వేణి కుమారుడు మృతి చెందడంతో ఇద్దరు మనవరాళ్లు, మనవడితో కలిసి నల్లకుంట రైల్వేట్రాక్ సమీపంలో నివాసం ఉంటోంది. డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న మనవరాలు పద్మావతి(19) న్యూనల్లకుంట బాయమ్మ గల్లీలో స్నేహితురాలు తేజస్వినితో కలిసి ఉంటోంది. గురువారం కృష్ణవేణి మనువరాలికి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో ఆమెకీ కోసం స్నేహితురాలిని సంప్రదించగా బుధవారం రాత్రి తనతో చెప్పకుండా వెళ్లిపోయిందని చెప్పింది. దీంతో ఆమె నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్‌చారి తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి (45) కాచిగూడ స్టేషన్ ప్లాట్‌ఫాంపై మృతి చెందాడు. మృతుడి ఒంటిపైన బ్లూ కలర్ ఫుల్ షర్టు, బ్లూ జీన్స్ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు భారంగా వంటగ్యాస్

- 9 ఏళ్లలో 13 సార్లు సిలిండర్ ధరలు పెరిగాయన్న నేతలు
- తగ్గించకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరిక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: వంటగ్యాస్ ధర పెంపు పేదలు, చిరు వ్యాపారులకు మోయలేని భారంగా మారిందని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. శుక్రవారం కాచిగూడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గడిచిన కొన్నేళ్లలో వంటగ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం అనేక సార్లు పెంచి పేద ప్రజల నడ్డి విరిచిందని ఆరోపించారు. పెంచిన వంటగ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేదంటే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హితవు పలికారు. కృష్ణ, భూషణ్, భాస్కర్, తుంగబాబు, ధరణీధర్‌యాదవ్, ప్రదీప్‌గౌడ్, అగమయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంట: కేంద్ర ప్రభుత్వ విధానాలు సామాన్య ప్రజల బతుకులను భారం చేస్తున్నాయని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆరోపించారు. బీజేపీ 2014లో అధికారంలోకి వచ్చిన సమయంలో పెట్రోల్ ధర లీటర్ రూ. 60 ఉండగా, గ్యాస్ సిలిండర్ ధర రూ. 400 ఉండేదన్నారు. ప్రస్తుతం లీటర్ పెట్రోల్ రూ. 110కి చేరుకోగా గ్యాస్ సిలిండర్ ధర రూ. 1200లకు చేరిందన్నారు. పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలకు నిరసనగా శుక్రవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద అంబర్‌పేట్ నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించాయి. పెంచిన ధరలను తగ్గించకపోతే దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమం చేపడతామన్నారు. అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు ప్రసాద్, మాజీ కార్పొరేటర్ రాంబాబు, సీనియర్ నాయకులు రంగారెడ్డి, నర్సింహారెడ్డి, చందర్, భూపతినాథ్, రవిందర్, భాస్కర్‌గౌడ్, నరేందర్, శంకర్, లింగం గౌడ్, ధన్‌రాజ్‌యాదవ్, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



కవాడిగూడ ప్రధాన రహదారిపై నిరసన చేపడుతున్న కాంగ్రెస్ నాయకులు

◆ అంబర్‌పేట నియోజక వర్గం నాయకులు, కార్యకర్తలు ఫీవర్ చౌరస్తా వద్ద మానవహారం ఏర్పాటు చేసి రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో 20 నిమిషాల పాటు ఎక్కడి వాహనాలు అక్కడి నిలచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

కవాడిగూడ: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌యాదవ్ విమర్శించారు. ప్రస్తుతం వినియోగదారులు రూ.1200 చెల్లించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ కవాడిగూడ డివిజన్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై నిరసన చేపట్టారు. మాజీ కార్పొరేటర్లు వాజిద్ హుస్సేన్, కల్పనాయాదవ్, ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ బీ–బ్లాక్ అధ్యక్షుడు కృష్ణ, నాయకులు ధర్మేందర్, అనిల్‌యాదవ్, సాయిబాబా, రమేష్‌యాదవ్, లక్ష్మణ్, భాస్కర్, బాబురావు, బబ్లూయాదవ్ పాల్గొన్నారు.

అంబర్‌పేట: పెరిగిన గ్యాస్ ధరలకు నిరసనగా బాగ్ అంబర్‌పేటలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో మాజీ కార్పొరేటర్ పద్మావతి హాజరై మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దేశ ప్రధాని మహిళలకు గ్యాస్ ధరలు పెంచి కానుకగా ఇచ్చారన్నారు. పెరిగిన గ్యాస్ ధరలతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతారన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

ముషీరాబాద్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్‌పై రూ.50 పెంచడాన్ని నిరసిస్తూ.. హరిరిసాలగడ్డలో సీఐటీయూ శ్రామిక మహిళా సమన్వయ కమిటీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్లు పెట్టి నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటేష్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ నగర కన్వీనర్ ఆర్.వాణి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను ఇష్టానుసారంగా పెంచుతుందని విమర్శించారు. సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు అజయ్‌బాబు, సహాయ కార్యదర్శి మహేందర్, నగర కమిటీ సభ్యులు పుల్లారావు, రేణుక పాల్గొన్నారు.

డిజిటల్ కరెన్సీతో దేశ ఆర్థిక స్థితిగతులు మెరుగు



బద్రుకా కళాశాలలో జాతీయ సెమినార్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ చెన్నప్ప

కాచిగూడ: దేశ సంపద, ఆర్థిక స్థితిగతులను సమర్థవంతంగా నిర్వహించేందుకు డిజిటల్ కరెన్సీ ప్రాధాన్యత వహిస్తుందని ఓయూ కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ చెన్నప్ప అన్నారు. కాచిగూడలోని బద్రుకా వాణిజ్య కళాశాలలో శుక్రవారం 'డిజిటల్ కరెన్సీ మరియు ఆర్థిక చేరిక' పై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. డిజిటల్ కరెన్సీతో డబ్బు వినియోగం క్రమ బద్ధీకరించబడుతుందన్నారు. వ్యాపార సామ్రాజ్యం కొనుగోలు అన్ని డిజిటల్ కరెన్సీతో జరుగుతుండటం శుభపరిణామమన్నారు.

◆ కేంద్ర ప్రభుత్వం ఐడీబీఆర్‌టీ మాజీ డైరెక్టర్ డాక్టర్ రామశాస్త్రీ మాట్లాడుతూ.. సెంట్రల్ బ్యాంకింగ్ డిజిటల్ కరెన్సీ ప్రవాహాలు, క్రిప్టో ప్రతికూలత, ఇంటర్నెట్ బ్యాంకింగ్‌ను తీసుకురావడంలో ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు.

◆ లావాదేవీల నియంత్రణ, డిజిటల్, లావాదేవీల పరిశీలన, ప్రతీ లావాదేవీలు, గోప్యత పరిశీలించబడతాయన్నారు. అంతర్జాతీయ చెల్లింపు ఎంపికలను మెరుగుపరచాలని సూచించారు.

◆ నికర లావాదేవీల ఖర్చులను తగ్గించి, తక్కువ ఆదాయ కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. ఓయూ మాజీ డీన్ ప్రొఫెసర్ అచలపతి, ప్రొ.నరేష్‌రెడ్డి, ప్రొ.ఎస్వీ సత్యనారాయణ, సీఏఎస్ రత్నాకర్, బద్రుకా కళాశాల సెక్రటరీ శ్రీకిషన్‌బద్రుకా, డైరెక్టర్ జనరల్ అభిరామ కృష్ణ, ప్రిన్సిపాల్ డా.మోహన్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ జానకిరామ్, డా.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. కాకతీయ, ఉస్మానియా, తెలంగాణ, శాతవాహన తదితర విశ్వవిద్యాలయాల నుండి వచ్చిన పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ లావణ్య

అంబర్‌పేట: నియోజకవర్గంలో తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్ల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం గోల్నాక డివిజన్ మారుతినగర్‌లో రూ.12 లక్షలతో నిర్మించనున్న పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇప్పటికే ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. తాగునీరు సరిగ్గా రావడం లేదని స్థానిక మహిళలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా.. జలమండలి మేనేజర్ రోహిత్‌ను పిలిచి సమస్యపై ఎమ్మెల్యే ఆరా తీశారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు, జలమండలి సిబ్బంది పాల్గొన్నారు.

'అగ్రిగోల్డ్ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి'



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు తదితరులు

కవాడిగూడ: రాష్ట్రంలో అగ్రిగోల్డ్ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో లేదంటే భూములను ఆక్రమించి బాధితులకు పంచుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో అగ్రిగోల్డ్ కంపెనీ కారణంగా నష్టపోయిన బాధితులకు భూములు అప్పగించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన చేపట్టారు. దీనిపై ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 14,15,16 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల వద్ద దీక్షలు చేపడతామని హెచ్చరించారు. తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలమల్లేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేంకటేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులు రజిత, సునీత, నాయకులు వేంకటేశ్వర్లు, అంజయ్యనాయక్, కాంతయ్య తదితరులున్నారు.

అలరించిన త్యాగరాజ స్వామి కీర్తనలు



నల్లకుంట: శ్రీరామ గానసభ ఆధ్వర్యంలో న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి 54వ వార్షిక ఆరాధన సంగీత మహోత్సవాలు ఆహుతులను విశేషంగా అలరిస్తున్నాయి. శేషాద్రి అయ్యంగార్, న్యూ నల్లకుంట బ్రాహ్మణ సేవా సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో చెన్నై సంగీత విద్వాంసులు ఆమని, రఘురాం బెంగుళూరుకు చెందిన ఆర్. వాసుదేవన్‌లు ఆలపించిన త్యాగరాజ స్వామి కీర్తనలను ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. దీనికి వయోలిన్‌పై సీతాపతి రావు, అనంతశౌరి రాజన్, మృదంగంపై మణి రఘురాం, సుదర్శన్ సుందరం, శ్రీనివాసగోపాలన్, ఘటంపై చంద్రకాంత్‌లు వాయిద్య సహకారం అందించారు.

బాలుడి కుటుంబాన్ని పరామర్శించిన కార్పొరేటర్

అంబర్‌పేట: వీధి కుక్కల దాడిలో మృతి చెందిన బాలుడి కుటుంబానికి అండగా ఉంటామని బాగ్ అంబర్‌పేట్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. గత నెల 19న 6 నెంబర్ చౌరస్తాలో ఓ కారు సర్వీసింగ్ సెంటర్‌లో గంగాధర్ కుమారుడు నాలుగేళ్ల ప్రదీప్ వీధి కుక్కలు దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం బాగ్ అంబర్‌పేట్ ఎరుకలబస్తీలో నివాసం ఉంటున్న బాలుడి తల్లిదండ్రులను కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి పరమర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, చుక్క జగన్, మిర్యాల శ్రీనివాస్, అరుణ్‌కుమార్, బాలకృష్ణాగౌడ్ తదితరులున్నారు.



బాలుడి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

భర్తతో ఉంటానని వివాహిత ఆందోళన.. కౌన్సిలింగ్

అంబర్‌పేట: భర్తతోనే ఉంటానంటూ ఓ వివాహిత తన కుమార్తెతో కలిసి ఆందోళనకు దిగింది. ఈ ఘటన శుక్రవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మిర్యాలగూడకు చెందిన మాధవికి, బాగ్అంబర్‌పేట రామకృష్ణనగర్‌కు చెందిన కిరణ్‌తో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. ఏడాది పాటు సజావుగానే ఉన్నారు. వీరికి ఓ కుమార్తె సంతానం. కాగా ఇద్దరి మధ్య మనస్పర్ధలు రావడంతో మాధవి పుట్టింటికి వెళ్లింది. అక్కడే కిరణ్‌తో పాటు వారి తల్లిదండ్రులపై వరకట్నం వేధింపుల కేసు పెట్టింది. ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో ఉంది. కేసు ఉన్నా.. భర్తతోనే ఉంటానంటూ దీక్షకు దిగడంతో సమాచారం అందుకున్న పోలీసులు కిరణ్ కుటుంబ సభ్యులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు నడుచుకుంటామని కేసు తేలకపోవడంతో మాధవిని ఇంట్లోకి రానివ్వమని భర్త కుటుంబసభ్యులు తేల్చి చెప్పారు. దీంతో పోలీసులు మాధవికి కౌన్సిలింగ్‌కు ఇచ్చి సికింద్రాబాద్‌లోని సఖి హోమ్‌కు తరలించారు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న తెలంగాణ బలహీన వర్గాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ పటేల్

కాచిగూడ: గొట్టి ముక్కల రిజర్వాయర్ కోసం రైతుల భూములను ప్రభుత్వం తీసుకుని నష్ట పరిహారంతో పాటు ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ నిలబెట్టుకోవాలని తెలంగాణ బలహీన వర్గాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గే శ్రీనివాస్ పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని గొట్టిముక్కల సింగరాసుపల్లి రిజర్వాయర్ రైతులను ఇంటికో ఉద్యోగం, నష్టపరిహారం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ఇంటికో ఉద్యోగం ఇవ్వకుండా ప్రభుత్వం ప్రాజెక్టును నిర్మిస్తుందన్నారు. సుమారు రూ. 30 లక్షల విలువ చేసే భూమికి కనీసం రూ.8 లక్షలైనా ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు ప్రారంభ సమయంలో ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ నిలబెట్టుకోవాలని లేని పక్షంలో రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ బలహీన వర్గాల సమితి రాష్ట్ర కార్యదర్శి అశోక్ పద్మశాలి, వెంకటేష్, సందీప్, వెంకటేష్‌గౌడ్, రాములు, శశికాంత్, శివముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఎదుగుదలకు కార్యాలయం పునాదిగా ఉండాలి



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కవాడిగూడ: పార్టీ కార్యాలయాల అభివృద్ధి ఎదుగుదలకు పునాదిగా ఉండాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. భోలక్‌పూర్ డివిజన్ ఇంద్రానగర్‌లో పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యాలయాలు ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్రాలుగా నిలవాలని సమస్య ఉన్న ప్రతి పౌరుడు కార్యాలయానికి వచ్చి చెప్పుకునే అవకాశం కల్పించాలన్నారు. విన్న సమస్యను తక్షణమే పరిష్కరించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో కలుషిత తాగునీరు, డ్రైనేజీ, రహదారుల సమస్యలతో అనేక ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న భోలక్‌పూర్ ప్రజల కోసం రాజకీయాలకు అతీతంగా కోట్లాది రూపాయలు కేటాయించి కలుషిత మంచినీరు, డ్రైనేజీ, రహదారుల సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు. సీఎం కేసీఆర్ పేదల సంక్షేమం కోసం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ.. పెద్ద దిక్కుగా నిలుస్తున్నారని కొనియాడారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. బీఆర్ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ, నాయకులు రహీం, ఎండీ షరీఫ్, మహమూద్ అలీ, ఉమాకాంత్, శంకర్‌గౌడ్, మునువర్‌చాంద్, జబ్బర్, దీన్‌దయాల్‌రెడ్డి, శివముదిరాజ్, మహేష్, రాములు, దినేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఫాల్గుణి మేళా వేడుకలు





ఉత్సాహంతో నిషాన్ ర్యాలీగా వస్తున్న మహిళలు

కాచిగూడ: శ్యామ్‌బాబా మహాభారత యుద్ధంలో తన శిరస్సును శ్రీకృష్ణ భగవానుడికి దానమిచ్చే రోజుగా చెప్పుకునే 'ఫాల్గుణి మేళా' వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీ కృష్ణుడి చిత్ర పటాల ప్రదర్శన, బ్యాండ్ మేళాలు, భజన కీర్తనలు, యువతీయువకులు, భక్తుల నృత్యాలతో సాగిన 'నిషాన్' శోభాయాత్ర అంబరాన్నంటాయి.

◆ కాచిగూడ రైల్వే స్టేషన్ సమీపంలో వీరన్నగుట్టపై ఉన్న శ్యామ్‌బాబా ఆలయానికి వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరసర ప్రాంతాలు కృష్ణ నామస్మరణతో మార్మోగాయి. నగరంలోని చార్మినార్, మలక్‌పేట, గుల్జార్‌హౌజ్, పత్తర్‌గట్టి, బేగంబజార్, బహదూర్‌పురా, ఇసామియా బజార్, రామంతాపూర్, సికింద్రాబాద్, సిద్ది అంబర్‌బజార్, మౌలాలీ తదితర ప్రాంతాల నుంచి నిషాన్ యాత్రలు సాగాయి. శ్యామ్ మందిర్ సేవా సమితి ప్రతి నిధులు ఇంద్రకుమార్ అగర్వాల్, సురేష్ అగర్వాల్, కైలాష్, రామ్‌దేవ్ అగర్వాల్, రాజ్‌కుమార్ విగ్, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ రాంబాబుల ఆధ్వర్యంలో స్వాగత ఏర్పాట్లు చేసి స్వాగతం పలికారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించి 56 రకాల మిఠాయిలను శ్యామ్‌బాబాకు నైవేద్యంగా సమర్పించారు. భీ మ్‌రాజ్, ఓంప్రకాష్, బాలప్రసాద్, రవియాదవ్, దినేష్, సంతోష్, భీష్మదేవ్, సదానంద్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, దేవిరెడ్డి విజితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పుట్టిన బిడ్డపై రూ. 1.52 లక్షల అప్పు భారం'



కవాడిగూడలో కరపత్రాలు అందజేస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

కవాడిగూడ: రాష్ట్రంలో పుట్టిన ప్రతి బిడ్డపై రూ.1.52 లక్షల అప్పు భారం పడిందని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం కవాడిగూడ డివిజన్‌లో కొత్తబజార్, ఉన్నికోట తదితర ప్రాంతాల్లో 'హాత్ సే హాత్ జోడో 'లో భాగంగా పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆయన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల రాష్ట్రంలో 8 వేల మందికి పైగా ఆత్మహత్యలు చేసుకున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ధనిక రాష్ట్రంలో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉందని ధరణి పేరుతో రైతులను దగా చేస్తున్నారని విమర్శించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఎటు చూసినా రోడ్లు, కలుషిత తాగునీరు, డ్రైనేజీ సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారన్నారు. ఈ సమస్యలను పరిష్కరించకుండా సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మాజీ కార్పొరేటర్లు వాజీద్ హుస్సేన్, ఆర్.కల్పనాయాదవ్, కృష్ణ, నాయకులు శ్రీరాములుయాదగిరి, రమేష్‌యాదవ్, పాశం అనిల్‌కుమార్, బాబురావు, మహేష్, భాస్కర్ తదితరులున్నారు.

వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా నూతన కార్యవర్గం



పార్టీ లోగోను ఆవిష్కరిస్తున్న జస్టిస్ చంద్రకుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా ఆవిర్భావ సదస్సు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. కార్మికులకు రాజ్యాధికారం రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులు దేశ సంపదను సృష్టించే వారని కార్మిక వర్గ సమస్యలపై ప్రభుత్వాలు స్పందించడంలో విఫలం చెందారన్నారు. ప్రొఫెసర్ ఖాసీం, రాజ్యాంగ పరిరక్షణ వేదిక ప్రతినిధి కామేశ్వర్‌రావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

◆ నూతన అధ్యక్షుడిగా పాండురంగాచారి, ఉపాధ్యక్షుడిగా నల్లా జగన్, లక్ష్మణాచారి, ప్రధాన కార్యదర్శిగా మేకల శ్యామ్‌సుందర్, సహ కార్యదర్శులుగా వెంకటస్వామి, కళావతి, కోశాధికారిగా కాసోజు నర్సమ్మ, సహ కోశాధికారిగా కవితతో పాటు 9 మంది రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 61 మందిని రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలి



గుజ్జ సత్యం

అంబర్‌పేట: పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు 200 శాతం పెరిగితే మెస్ చార్జీలను 25 శాతం పెంచాలని మంత్రివర్గ ఉప సంఘం సిఫార్సు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై సీఎం కేసీఆర్ స్పందించి మెస్ చార్జీలను 50 శాతం వరకు పెంచాలని గత ఆరేళ్లుగా పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెరగలేదన్నారు. రాష్ట్రంలో 295 బీసీ కాలేజీ హాస్టళ్లకు, 321 బీసీ గురుకుల పాఠశాలల్లో ఒక్క దానికి కూడా సొంత భవనాలు లేవని వీటికి కేటాయించిన ప్రభుత్వ స్థలాలను కూడా ప్రైవేటు సంస్థలు, వ్యక్తులకు అధికారులు దారదత్తం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్కో రూమ్‌లో 20 నుంచి 50 మందిని ఉంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలపై ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి





విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నల్లకుంట: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు యువతకు సూచించారు. తల్లిదండ్రులు తమ బిడ్డలపై ఉన్న ప్రేమతో మైనర్లకు వాహనాలు ఇస్తున్నారని అది సరైన పద్ధతి కాదన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి లైసెన్స్‌లు ఇప్పించాలని ఆ తర్వాతే బిడ్డలకు వాహనాలు ఇవ్వాలని సూచించారు. బేగంపేట టీటీఐ సిబ్బంది వెంకట ప్రసాద్, క్రిష్ణ, చక్రధర్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం నల్లకుంట హిందీ మహావిద్యాలయం ఆడిటోరియంలో విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రిటైర్డ్ కల్నల్ పరమేశ్వర్, ఐఎంసీటీసీఫ్ రాంరెడ్డి, హిందీ మహా విద్యాలయం ప్రిన్సిపాల్ అవినాష్, కళాశాల ఎన్‌సీసీ కాడెట్స్, సిబ్బంది పాల్గొన్నారు.

కాచిగూడలో..

కాచిగూడ: భారత్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రత్యేకంగా ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ పోలీస్ సిబ్బంది అవగాహన కల్పించారు. కాచిగూడలోని కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విధుల్లో పాల్గొనడం ద్వారా సమాజానికి తమవంతు తోడ్పాటును అందించినట్లు అవుతుందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ పొందే పద్ధతి, ఉపయోగాలు, స్టాప్‌లైన్, ఫ్రీ లెఫ్ట్, మోటార్ వెహికల్ యాక్ట్ తదితర విషయాలను పీపీటీ ద్వారా వివరించారు.